క్లుప్తంగా

భైరవకోన హుండీ ఆదాయం రూ.2.95 లక్షలు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ, సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోన భైరవేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం భైరవకోన ఆలయ హుండీ లెక్కింపును దేవదాయ ధర్మాదాయ శాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సుబ్బారావు పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. హుండీ కానుకలు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి హుండీలను లెక్కించగా మొత్తం రూ.2,95,361 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు, ఎం పవన్ కుమార్‌రాజు, ఎం.మోహన్‌రాజు, ఎం.ఆర్.శ్రీనివాసులు అర్చకబృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రిని అందజేస్తున్న దాత చెక్కా చెన్న కేశవులు

కనిగిరిరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అధ్యాపకులు, దాత చెక్కా చెన్నకేశవులు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థుల విద్యోన్నతికి చేయూతనందించడాన్ని కొనియాడారు. అధ్యాపకులు ఖాశింపీరా, కుమ్మరకుంట సురేష్, వి రామరాజు, కోటి సాహెబ్, పివి రమణా, గురవమ్మ, సాయి, ఉమ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.


లింగ వివక్షపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్

కొండపి: లింగ వివక్షపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కిశోరి వికాసం జిల్లా రిసోర్స్ పర్సన్ రత్నప్రసాద్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కొండపి-1సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించండి..ఆడపిల్లలను చదివించండి అనే నినాదంతో ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లిళ్ల చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. సూపర్‌వైజర్లు విక్టోరియా రాణి, మాధవిలత పాల్గొన్నారు.

కనులపండువగా అమ్మవారి నగరోత్సవం



టంగుటూరులో నగరోత్సవంలో అంగాళ పరమేశ్వరి అమ్మవారు

టంగుటూరు: స్థానిక రావూరి సోమయ్య నగర్‌లో కొలువైన అంగాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం పంచామృత అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణలో దీపధూప హారతులు ఇచ్చారు. అమ్మవారి నగరోత్సవంలో పాలబిందెలు, నిప్పు కుండలు, కేరళ వాయిద్యాలు, దీపాలు, కాళీమాత వేషధారణ కోలాటంతో ఉత్సవం కనులపండువగా సాగింది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మద్దిపాడు: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ చల్లారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులు ఆర్థిక ప్రణాళికపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ అల్లూరయ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్‌కుమార్, కృష్ణ, సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

కొండపి: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని ఎస్సై ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక కామేపల్లి సెంటర్‌లో గురువారం సాయంత్రం వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకొని జరిమానా విధించి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలపై అంతులేని నిర్లక్ష్యం..!



కనిగిరి ఆదర్శ పాఠశాల



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ, విద్యాశాఖ అధికారులు(ఫైల్)

- తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్, డీఈఓల వద్ద ఎస్ఎంసీ కమిటీల గగ్గోలు
- తనిఖీలతో సరి.. తక్షణ చర్యలు లేవు.
- సమీపిస్తున్న పరీక్షలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కనిగిరిరూరల్:

కారణాలు ఏమైనా ఒక నాడు.. ఒక వెలుగు వెలిగిన ఆదర్శ పాఠశాలలు.. నేడు కునారిల్లుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..దెబ్బతిన్న వ్యవస్థల్లో విద్యా వ్యవస్థ ఒకటి. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో శరవేగంగా సాగిన నాడు-నేడు అభివృద్ధి పనులు నేడు నిధుల లేమితో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా మారింది. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. తాగునీటి సమస్య, మౌలిక వసతుల కల్పన సక్రమంగా లేక విద్యాబోధన కుంటుపడి విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఉత్తీర్ణతా శాతంలో ఎంతో మంది ఆదర్శంగా నిలిచిన కనిగిరి ఆదర్శ పాఠశాలలో ప్రస్తుత పరిస్థితిపై దృష్టి సారించాలని ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు కలెక్టర్, డీఈఓకు వినతిపత్రాలు అందజేశారు.

గతమెంతో ఘనం..

కనిగిరి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 559 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరిలో దాదాపు 82 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. అయితే గత నాలుగైదేళ్లుగా పదో తరగతిలో 95 శాతం నుంచి 98 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉత్తీర్ణత ఫలితాలు పరిశీలిస్తే.. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కూడా నిలిచింది. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించడంతో పాటు కనీస మౌలిక వసతుల కల్పన కరువై.. భోదన తీరులో ప్రణాళికాబద్ధం కరువైందన్న విమర్శలు ఉన్నాయి.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎంసీ కమిటీ చైర్మన్(ఫైల్)

తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు ఇవి...

- ప్రస్తుతం ఖాళీగా ఉన్న సోషల్, ఇతర సబ్జెక్టు టీచర్లను నియమించి విద్యార్థులకు బోధన చేయాలి. తదనుగుణంగా ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలి.
- పాఠశాలలోని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అంతా టీం వర్క్‌లా పనిచేసి విద్యార్థులకు మెరుగైన, సులభతర బోధనా మెళకువలు అందించాలి.
- తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలి.
- స్టడీ అవర్స్‌లో ఉన్న విద్యార్థులకు ఆలస్యమైనప్పుడు ఇళ్లకు చేరేందుకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.
- విద్యార్థుల మధ్యాహ్న భోజన అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- పరీక్షా సమయం కావడంతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి.
- పరీక్షలు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు విధి నిర్వహణలో ఉండేలా చర్యలు చేపట్టాలి.
- విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించకుండా, ఇతరత్రా వ్యాపకాలపై దృష్టి లేకుండా ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించాలి.

కలెక్టర్, డీఈఓలకు సమస్యలు విన్నవించా:



ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్, డీఈఓలకు విన్నవించాం. విద్యాశాఖ మోడల్ స్కూల్స్ డీఈఓ బృందం వచ్చి పరిశీలించి వెళ్లారు. కానీ తక్షణ చర్యలుగా ఏమీ జరగలేదు. గురువారం రోజు వారిగా వచ్చే ఆర్టీసీ బస్సుకూడా రాకపోవడంతో కొందరు విద్యార్థులు కిలో మీటర్ నడిచి ప్రధాన రోడ్డుపైకి వచ్చారు. తల్లిదండ్రులు వచ్చి విద్యార్థులను తీసుకెళ్లారు. ఇలాగే ఉంటే పదో తరగతి ఉత్తీర్ణతా శాతం తగ్గే అవకాశం ఉంది. అధికారులు తక్షణం దీనిపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

పందిటి మోహన్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్

కమనీయం..కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి కల్యాణంలో తాళిబొట్లు చూపుతున్న అర్చకులు



ఆలయ ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు



గండదీపాలతో ఆలయానికి తరలివస్తున్న భక్తులు



గండదీపాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో నారాయణ స్వామివారి 67వ సాప్తాహ్నిక, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి కల్యాణ మండపంపై అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ, పప్పు శ్రీకాంత్‌లు వేదమంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహాశిష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు.

వైభవంగా గండదీపోత్సవం

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో నారాయణస్వామి ఆలయంలో గండదీపోత్సవం ఘనంగా నిర్వహించారు. పామూరు, సీఎస్‌పురం మండలాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తిస్వామి, నారాయణ స్వామి ఉత్సవమూర్తులకు మొదట పల్లకిపై ఆలయ ఉత్సవం అనంతరం హంసంవానంపై మేళతాళాల నడుమ గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావులు బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించారు. పామూరు సీఐ రామానాయక్, సీఎస్‌పురం ఎస్సై ఆర్.సుమన్ ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.



ఉదయం 11 గంటలకు తెరుచుకోని వ్యవసాయ శాఖ కార్యాలయం



మూసి ఉన్న విద్యా శాఖ కార్యాలయం



11 గంటలకు తలుపులు తెరుచుకోని విద్యుత్ శాఖ కార్యాలయం

ఎప్పుడు వస్తారో.. ఎవ్వరికీ తెలియదు..

మండలంలోని కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలు కనీసం ఉదయం 11 గంటలకు కూడా తలుపులు తెరుచుకోవడం లేదు. ఈ శాఖలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆ శాఖల అధికారులు ఎప్పుడు వస్తారో.. ఎవ్వరికీ తెలియని పరిస్థితి. మండల పరిషత్ కార్యాలయం, ఏపీఓ కార్యాలయాలు తెరిచినా ఉన్నా ఒక్క అధికారి కనిపించలేదు. ఇక వ్యవసాయ శాఖ, విద్యుత్, విద్యా శాఖ కార్యాలయాలైతే అసలు తలుపులే తీయలేదు. ఈ కార్యాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– టంగుటూరు



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు



ఉపాధి హామీ కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

ఘనంగా గంధ మహోత్సవం



పాష్షాహుస్సేని దర్గాలో పూజలు చేస్తున్న చైర్మన్ గఫార్ దంపతులు

కనిగిరిరూరల్: చరిత్రకు సాక్షిగా కల్గిన హాజరత్ శ్రీ శ్రీ సయ్యద్ బాదేషా పాశ్ఛా హుస్సేని చిష్టవుల్ ఖాదరీ 127వ గంధ మహోత్సవ వేడుకలు గురువారం రాత్రి వైభవంగా జరిగాయి. ఉరుసు సందర్భంగా హాజరత్ వారి దర్గాను విద్యుత్ దీప పూల అలంకరణలతో తీర్చిదిద్దారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు కుల, మత వర్గాలకతీతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు ఉన్నవారు ఎంతో నియమనిష్టలతో దర్గాపై పూజా వస్త్రం ఉంచి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి జెండాలు, గంధం ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. దర్గాలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ దంపతులు విశిష్ట పూజలు చేశారు. స్వామి దర్గాపై పూల్ చాదర్(పూజా వస్త్రం) ఉంచి, ఎంతో భక్తి శ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించారు. దర్గా కమిటీ నాయకులు చైర్మన్ గఫార్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసుల యాదవ్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్, న్యాయవాది సుమైర్, హన్ను, బన్ను, వైఎస్సార్ సీపీ నాయకులు నాగూర్ బీ, జిలానీ, మున్నా, సమద్, మదర్ థెరిస్సా సేవాసమితి నాయకులు ద్రోణాదుల చెంచులు, ఎల్ఐసీ నారాయణ, దర్గా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలి

కనిగిరిరూరల్: విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఏఎల్ఎస్ఎం ఎస్ వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఎన్జీవో దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్జీఓలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. కరోనా, వంటి విపత్కర పరిస్థితుల్లో ఎన్జీవో సంఘాలు అనేక సేవలు అందించారని వివరించారు. నేటి యువత, విద్యార్థులు సమాజ సేవలో భాగస్వామ్యులు కావాల్సిన అవశ్యకత ఎంతైన ఉందన్నారు. గుడ్‌హెల్ప్ సంస్థ డైరక్టర్ మంద్రు రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల ప్రారంభం



అడవి పేరంటాళమ్మ తల్లి మూల విరాట్

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి అడవిలో వెలసిన అడవి పేరంటాళ్లమ్మ తల్లి తిరునాళ్ల గురువారం ప్రారంభమైంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ఇక్కడి భక్తులు నమ్ముతారు. ఈ సందర్భంగా సాగుబడి, అలంకరణ, నిధుల ఉత్సవం, గ్రామోత్సవంతో తిరునాళ్ల ముగుస్తుంది. శనివారం పెద్ద ఎత్తున తిరునాళ్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా నేరేడుపల్లిలో వెలసిన అడవి పేరంటాళమ్మ తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

కనిగిరిరూరల్: ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఫలితాల్లో యూనివర్శిటీ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులను గురువారం పలువురు అభినందించారు. జువాలజీలో యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన ఎం జయలక్ష్మిని, బీకాం కంప్యూటర్‌లో టౌన్ టాప్ సాధించిన కామిరెడ్డి శైలజను, బీసీఏలో టౌన్ ఫస్ట్ సాధించిన ఈర్ల స్పందనను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాడెంట్, డైరక్టర్ రామన విజయలక్ష్మి, అధ్యాపకులు హానోక్, సాయికుమార్, హరి నారాయణ, మస్తాన్, అనీల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరిరూరల్:జాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె.ఉషారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 34 మంది ఎంపికయ్యారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్ బెనర్జీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ వెంకటేష్

మద్దిపాడు: మండలంలోని ప్రతి రైతు విశిష్ట నంబర్ కలిగి ఉండాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ అన్నారు. మండలంలోని ధర్మవరం, పన్నూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందికి ప్రభుత్వం రూ.7,550 మద్దతు ధర కల్పిస్తుందన్నారు. కందులను ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. అనంతరం పంటలను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు స్టెఫిన్, రవిచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహా ప్రాకార నిర్మాణానికి విరాళం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం వద్ద నిర్మించ తలపెట్టిన మహాప్రాకార నిర్మాణానికి దర్శి మండలం తిమ్మాయిపాలెం గ్రామానికి చెందిన దాతలు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం విరాళం నగదు రూ.1,00,116 ఆలయం వద్ద దాతలు గోను లక్ష్మీనారాయణరెడ్డి, పద్మావతి ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణలకు అందజేశారు. ఈసందర్భంగా దాతలను చైర్మన్ శేషవస్త్రంతో సన్మానించి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.